పాతబస్తీలో దీపావళి సందడి

- పండుగకు సిద్ధంగా ఉన్న ప్రమిదలు
- కళకళలాడుతున్న దీపావళి మార్కెట్లు
- చార్మినార్‌లో అమ్మకానికి సిద్ధంగా బొమ్మల కొలువు



చార్మినార్ వద్ద బొమ్మలు ఖరీదు చేస్తున్న వినియోగదారులు

చార్మినార్: పాతబస్తీలో దీపావళి సందడి నెలకొంది. పండుగకు కావాల్సిన వస్తువులను ఖరీదు చేయడంలో ప్రజలు పూర్తిగా నిమగ్నమయ్యారు. ఇప్పటికే ధంతేరస్ పూజలతో పాటు నరక చతుర్దశి నిర్వహించుకున్న ప్రజలు ఇక ఆదివారం జరుపుకునే దీపావళి వేడుకలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పాతబస్తీలో అక్కడక్కడ బాణాసంచా విక్రయించే తాత్కాలిక దుకాణాలు వెలిశాయి. ఆది, సోమ వారాల్లో దీపావళి సంబరాలు జోరుగా కొనసాగుతాయని తమ వ్యాపారాలు పుంజుకుంటాయని బాణాసంచా వ్యాపారులు అంటున్నారు. ఇదిలావుండగా గత ఏడాది కన్నా ఈ ఏడాది టపాకాయల రేట్లు అధికంగా ఉన్నాయని వినియోగదారులంటున్నారు.

జోరుగా బొమ్మల విక్రయాలు..

దీపావళి పండుగ రోజు బొమ్మల కొలువుకు అత్యంత ప్రాధాన్యతనిస్తుండడంతో... చార్మినార్ వద్ద వివిధ రకాల బొమ్మల విక్రయాలు జోరందుకున్నాయి. ఇక్కడ కొలువుదీరిన ఈ బొమ్మలు అత్యంత ఆకర్షణీయమైన కళాకృతులతో పాటు వివిధ రంగులతో కళ్లు మిరుమిట్లు గొలుపుతున్నాయి. విజయవాడలోని కొండపల్లి బొమ్మలతో పాటు కోల్‌కతా నుంచి తరలించిన చెక్క, కొయ్య, రబ్బరు బొమ్మలు వినియోగదారులతో పాటు చార్మినార్ సందర్శకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అలాగే దీపావళి సందర్భంగా మార్కెట్లు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. మట్టి దీపాంతలు ఖరీదు చేయడంలో మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తుండడంతో వాటికి గిరాకీ పెరిగింది.

ఆకట్టుకునేలా దీపాంతలు..

దీపావళి కోసం మార్కెట్‌లో దీపాంతలు (ప్రమిదలు) సిద్ధంగా ఉన్నాయి. ఘాన్సీబజార్, గుల్జార్‌హౌస్, చార్మినార్‌లలో ఏర్పాటు చేసిన రంగు రంగుల ప్రమిదలు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. ఒకప్పుడు కేవలం మట్టితో తయారు చేసే ప్రమిదలు మాత్రమే మార్కెట్‌లో అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వాటి స్థానంలో ఆకట్టుకునే విధంగా రంగురంగుల దీపాంతలొచ్చాయి. వివిధ ఆకారాలలోని రంగురంగుల దీపాంతలు, ఫ్లోటింగ్ కాండిల్స్ మార్కెట్లో లభ్యమవుతున్నాయి.

లక్ష్మీదేవి పూజలు నిర్వహిస్తాం..



దీపావళిని కుటుంబసభ్యులతో కలిసి ఆనందోత్సాహాల నడుమ నిర్వహించుకుంటాం. గణపతి పూజ, గౌరి పూజ, నవగ్రహాల పూజల అనంతరం లక్ష్మీదేవి విగ్రహానికి అభిషేకం నిర్వహిస్తాం. అనంతరం సహస్ర పుష్పార్చన, అమ్మవారికి డ్రై ఫ్రూట్స్ మిఠాయిలతో నైవేద్యం సమర్పిస్తాం. దాదాపు మూడున్నర గంటల పాటు దీపావళి లక్ష్మీదేవి పూజలు నిర్వహిస్తాం.

– గాజుల అంజయ్య, మీరాలంమండి ఆలయ కమిటీ చైర్మన్

వార్షిక వ్యాపార లావాదేవిలు లెక్కిస్తాం..



నగరంలోని కన్నడీగులు దీపావళి నుంచి దీపావళి వరకు వార్షిక వ్యాపార లావాదేవిలను లెక్కించడం ప్రారంభిస్తారు. నగరంలోని కన్నడీగులు దీపావళి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించుకునే విధంగానే నగరంలో స్థిరపడిన కన్నడీగులు మహాలక్ష్మీదేవి పూజలతో దీపావళి వేడుకలను జరుపుకుంటారు. కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీదేవి విగ్రహాలకు వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అమ్మవారికి నైవేద్యంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం.

– నాగ్‌నాథ్ మాశెట్టి, టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు

'పదవుల కోసమే రాథోడ్ రాజీనామా'



ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్ రాజీనామా చేయడంతో గోషామహల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ రెట్టింపు మెజార్టీతో విజయం సాధిస్తాడని గోషామహల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. 30 ఏళ్లుగా గోషామహల్ నియోజకవర్గంలో సింగల్ మెన్‌గా పిలువబడే రాథోడ్‌తో బీఆర్‌ఎస్‌కు నష్టమే జరిగిందే తప్పా ఏ నాడు లాభం జరుగలేదన్నారు. శనివారం ఆనంద్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. 2016లో రాథోడ్ కుమారుడికి బేగం బజార్‌లో బీజేపీ వారు బీజేపీ టికెట్ ఇవ్వనిచో బీఆర్‌ఎస్‌లో రాథోడ్ చేరారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వెంటనే మూసీ రివర్‌ఫ్రంట్ ఛైర్మన్‌గా, 2018 ఎమ్మెల్యే ఎన్నికల్లో గోషామహల్ బీఆర్‌ఎస్ టికెట్ పొందిన విషయం రాథోడ్ మరిచిపోయారా..? అని ఆయన ప్రశ్నించారు. కేవలం పదవుల కోసమే రాథోడ్ పార్టీలు మారుతున్నారని ఆనంద్‌కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. రాథోడ్ పార్టీ మారడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు.

'గోషామహల్‌లో బీజేపీని చిత్తుగా ఓడిస్తాం'



జగన్‌మోహన్‌రావును సత్కరిస్తున్న ముఖేష్ సింగ్ తదితరులు

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో ఎన్నికలప్పుడే ప్రజలముందుకు వస్తున్న బీజేపీ అభ్యర్థి రాజాసింగ్‌ను చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి పి.జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ధూల్‌పేట్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో జగన్‌మోహన్‌రావును మాజీ కార్పొరేటర్ ముఖేష్ సింగ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలో పదేళ్లుగా రాజాసింగ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. మతాలకు మధ్య చిచ్చుపెడుతూ మతం పేరుతో ఓట్లు దండుకునే రాజాసింగ్‌కు ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ 24 గంటల పాటు 25 ఏళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్వాన్‌లో అమర్‌సింగ్ పాదయాత్ర



ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్

గోల్కొండ: కార్వాన్ నుంచి మజ్లిస్‌ను తరిమికొడితేనే కార్వాన్ అభివృద్ధి చెందుతుందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. శనివారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేసి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్వాన్ అభివృద్ధి చెందాలంటే కార్వాన్‌ను మజ్లిస్ ముక్త్ కార్వాన్‌గా చేయాలని అన్నారు. దీని కోసం ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థికి ఓటు వేయకుండా తనకే వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యోగ్‌రాజ్‌సింగ్, సునీల్‌యాదవ్, డిజ్వర్‌సింగ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఇస్మాయిల్ అన్సారీ



నాంపల్లి: గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నేత మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ అలియాస్ ఉర్దూ అన్సారీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీతో మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గాఢి సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్, కాంగ్రెస్ నేత సాజిద్ బిన్ అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు మేలు



లలితాబాగ్‌లో ప్రచారం చేస్తున్న బోయ నగేష్

చాంద్రాయణగుట్ట: కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు మేలు జరుగుతుందని చాంద్రాయణగుట్ట కాంగ్రెస్ అభ్యర్థి బోయ నగేష్ అన్నారు. లలితాబాగ్, తానాజీనగర్, ఉప్పుగూడ జెండా, రాఘవేంద్ర స్వామి నగర్‌లలో శనివారం ఆయన ఇంటింటికీ తిరుగుతూ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ.. బీసీ, మైనార్టీ డిక్లరేషన్‌తో ఆయా వర్గాల స్థితిగతులు మారనున్నాయన్నారు. కుటుంబ పాలనతో అవినీతికి పాల్పడుతున్న కేసీఆర్ సర్కార్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ చారి పాల్గొన్నారు.

విశ్వరూప మహా సభకు తరలిన నేతలు



సభకు బయల్దేరిన ఆదిజాంభవ సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు

జియాగూడ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్‌పై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మాదిగల ఉపకులాల విశ్వరూప మహాసభకు జియాగూడ ఇందిరానగర్ నుంచి ఆదిజాంబవ సంఘం పెద్ద ఎత్తున బయల్దేరింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు మిర్యాల నవీన్, చంద్రమోహన్, ఆదిజాంబవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశవ్, మాజీ అధ్యక్షుడు ఎం.బాలకృష్ణ, సంఘం ప్రధాన కార్యదర్శి జి.సురేష్, కోశాధికారి బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి



ప్రేమ్‌కుమార్

యాకుత్‌పురా: దీపావళి సందర్భంగా ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మొఘల్‌పురా అగ్నిమాపక కేంద్రం ఎస్‌ఎఫ్‌ఓ ప్రేమ్‌కుమార్ సూచించారు. శనివారం మొఘల్‌పురాలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది లాగే టపాసు దుకాణాల ఏర్పాటుకు ఆన్‌లైన్ ద్వారా 60 దరఖాస్తులందాయన్నారు. లాల్‌దర్వాజా వేంకటేశ్వర స్వామి ఆలయం, ఉప్పుగూడ మహంకాళీ ఆలయం, ఛత్రినాక తవ్వలబావి, గౌలిపురా ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నామన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



కళాశాల లీడర్లుగా ఎంపికైన వారితో అధ్యాపకులు

గోల్కొండ: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జి.రాఘవరెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో విద్యార్థి ప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి నాయకులుగా పని చేసిన వారు ఎందరో దేశ రాజకీయాల్లోకి వచ్చి విశేషంగా రాణించారని అన్నారు. అయితే విద్యార్థులు మొదటి ప్రాధాన్యత చదువుకే ఇవ్వాలని ఆయన అన్నారు. కళాశాల అధ్యక్షురాలిగా ఇషితాదోనిపర్తి, ఉపాధ్యక్షురాలిగా ఆర్.ఆర్షితరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తరుణ్యవర్మ, జాయింట్ సెక్రటరీగా ఎస్.మేఘనరెడ్డి, కల్చరల్ సెక్రటరీగా కె.జ్యోత్స్న, టెక్నికల్ కార్యదర్శిగా హిమజ ఇల్లూరు, స్పోర్ట్స్ సెక్రటరీగా ఎస్.వి.ఎల్.సంతోషిపావనీ, ఫైనాన్స్ సెక్రటరీగా సయ్యదాషిఫా ఫాతిమా, ఎడిటర్ ఇన్ చీఫ్‌గా టి.భవానీ, పీఆర్ సోషల్ మీడియా హెడ్‌గా టి.హర్షిత, మార్కెటింగ్ అండ్ బ్రాండింగ్ హెడ్‌గా ఏ.అక్షరారావు, క్రియేటివ్ డిజైన్ హెడ్ ఏ.రోషిణి ప్రియ, కమ్యూనికేషన్, డాక్యుమెంటేషన్ హెడ్‌లుగా ఏ.ప్రీతిపాటిల్, జి.యశశ్విశ్రీ పదవీ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ వైస్ చైర్‌పర్సన్ జి.శ్రీవిద్యారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

'రాథోడ్ గోషామహల్‌లో తిరిగితే అడ్డుకుంటాం'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు ధన్‌రాజ్ తదితరులు

అబిడ్స్: తరచు పార్టీలు మారుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్ గోషామహల్‌లో తిరిగితే అడ్డుకుంటామని దళిత గ్రాడ్యుయేట్ ఫోరం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎస్.ధన్‌రాజ్ పేర్కొన్నారు. బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌కు వచ్చి ఏడేళ్లలో మంచి పదవులు అనుభవించిన రాథోడ్ తిరిగి బీజేపీలోకి పోవడం సిగ్గుచేటన్నారు. శనివారం జాంబాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ధన్‌రాజ్ మాట్లాడుతూ..2016లో బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి వచ్చిన రాథోడ్ బీఆర్‌ఎస్‌లో చిల్లిగవ్వ కూడా పనిచేయకపోయినా చైర్మన్ పదవి అనుభవించలేదా..? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా పోటీ చేసి నాలుగున్నరేళ్లుగా ఏరోజూ ఒక్క కార్యకర్తకు ఎలాంటి సహాయం చేయలేదని ఆయన అన్నారు. రాథోడ్ పోవడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ 50 వేల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

అవినీతి రహిత పాలన అందించడమే బీజేపీ లక్ష్యం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీరేందర్ బాబు యాదవ్

గౌలిపురా: అవినీతి రహిత పాలన అందించడానికి ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రి ప్రకటించడం జరిగిందని బీజేపీ యాకుత్‌పురా నియోజకవర్గం అభ్యర్థి ఎస్.వీరేందర్ బాబు యాదవ్ అన్నారు. యాకుత్‌పురా నియోజకవర్గం గౌలిపురా డివిజన్‌లో శనివారం ఎన్నికల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీకి రాష్ట్ర వ్యాప్తంగా ఒక మంచి వాతావరణం ఏర్పడిందన్నారు. బీజేపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు గౌలిపురా గడ్డ బీజేపీ అడ్డగా ఉంటుందన్నారు. ఎంతో మంది కార్యకర్తలను తయారు చేసిన ఈ ప్రాంతంలో నేను అభ్యర్థిగా నిలబడటం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రజలందరూ తమ అమూల్యమైన ఓటును కమల గుర్తుకు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. తనకు అవకాశం కల్పిస్తే పాతబస్తీ అభివృద్ధికి బీజేపీ నిరంతరం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆలే జితేంద్ర, కె.సహదేవ్ యాదవ్, జమాల్‌పూర్ చంద్రశేఖర్, జి.ధీరజ్‌లాల్, ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, జి.రఘుకాంత్, కె.రాజ్ కుమార్, జె.అశోక్, మోకాళ్ల వెంకటేశ్, ఎ.శివచంద్రగిరి, కె.జగన్‌మోహన్, ఆర్.ఈశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

విజ్ఞతకు అవార్డు ప్రదానం



చార్మినార్: అంబికానగర్‌కు చెందిన ఉపాధ్యాయురాలు జక్కుల విజ్ఞతకు మౌలానా అబుల్ కలాం ఆజాద్–2023 అవార్డు దక్కింది. జస్టిస్ వామనరావు చేతుల మీదుగా ఆమె శనివారం ఈ అవార్డు అందుకున్నారు. నవ భారత నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా శంషీర్‌గంజ్ శారదా విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న విజ్ఞతకు ఉత్తమ ఉపాధ్యాయురాలుగా గుర్తిస్తూ ఈ అవార్డు అందజేశారు. గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్, ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తుల హేమంత్, సంఘసేవకులు శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

దేవర కరుణాకర్‌కు ఘన నివాళి



గోల్కొండ: దేవర కరుణాకర్ మృతితో ఒక గొప్ప నాయకుడిని కోల్పోయామని లతామా ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవీలత అన్నారు. శనివారం గుడిమల్కాపూర్‌లో దేవర కరుణాకర్ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజల గుండెల్లో కరుణాకర్ శాశ్వతంగా ఉండిపోతారన్నారు. నిరుపేదలకు, రోజువారి కూలీలకు అండగా ఉంటూ వారికి లాక్‌డౌన్ సమయంలో ఎంతగానో ఆదుకున్న గొప్ప వ్యక్తి కరుణాకర్ అని ఆమె అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, బీజేపీ కార్వాన్ అభ్యర్థి అమర్‌సింగ్, బీజేపీ సీనియర్ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ పాల్గొన్నారు.

న్యూసెన్స్ కేసులో వ్యక్తికి జైలు

డబీర్‌పురా: రోడ్డుపై న్యూసెన్స్ చేస్తున్న ఓ వ్యక్తికి నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.సత్యనారాయణ మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. రెయిన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..యాకుత్‌పురాకు చెందిన మహ్మద్ అక్బర్ (36) రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డుపై న్యూసెన్స్ చేస్తూ స్థానికులకు ఇబ్బందులకు గురిచేశాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు అక్బర్‌ను అరెస్ట్ చేసి శనివారం కోర్టులో హాజరుపరచగా మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి పూజలు



చార్మినార్: చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో శనివారం చోటా దీపావళి (నరక చతుర్దశి)ని పురస్కరించుకొని తెల్లవారుజామున 4 నుంచి 5 గంటల వరకు అభిషేకం, 7 గంటలకు హారతి, అనంతరం భక్తులకు అమ్మవారి ప్రథమ దర్శనంతో భక్తులు రాత్రంతా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేశ్ తివారీతో కలిసి టీఎస్ మాజీ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాష్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం శుభ దీపావళిని పురస్కరించుకుని భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజల్లో భాగంగా ఉదయం 7 గంటలకు హారతితో అమ్మవారి దర్శనం మొదలవుతుంది. దీపావళి పండుగకు అమ్మవారు మోహినీ రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని ఆలయ ట్రస్టీ శశికళ తెలిపారు.

13న స్క్రూటిని.. ఫైనల్ లిస్టు ప్రకటన



వెంకన్న, రిటర్నింగ్ అధికారి

చార్మినార్: నామినేషన్ల పర్వం ప్రశాంతంగా ముగిసిందని.. చార్మినార్ నుంచి ఎన్నికల బరిలో ఇప్పటి వరకు 22 మంది అభ్యర్థులున్నారని.. వీటి స్క్రూటిని ఈనెల 13న జరుగుతుందని చార్మినార్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. ఉదయం 11 గంటలలకు అభ్యర్థుల సమక్షంలో జరిగిన స్క్రూటిని అనంతరం ఫైనల్ లిస్టు డిస్‌ప్లే చేస్తామన్నారు. అలాగే 13 నుంచి 15 వరకు విత్‌డ్రా ఉంటుందన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు



కట్టెలగూడలో..



విజయనగర్‌కాలనీలో..



మెహిదీపట్నంలోని శ్రీచైతన్య పాఠశాలలో

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో దీపావళి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో బొమ్మల కొలువు ఏర్పాటు చేసి లక్ష్మీపూజ చేసి స్వీట్లు తినిపించుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నౌషీర్‌ఖాతూన్, జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌ఐ.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మాస్టర్స్ కాన్సెప్ట్ స్కూల్‌లో..

డబీర్‌పురా: దీపావళిని పురస్కరించుకొని డబీర్‌పురా కట్టెలగూడలోని మాస్టర్స్ కాన్సెప్ట్ స్కూల్‌లో దీపావళి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మెహిదీపట్నంలో..

సాక్షి, సిటీబ్యూరో: మెహిదీపట్నంలోని శ్రీచైతన్య పాఠశాలలో దీపావళి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎస్.స్వాతి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ కాలుష్య రహిత బాణాసంచా విషయంపై తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాన్నారు. శ్రీచైతన్య పాఠశాల మెహిదీపట్నం జోన్ ఏజీఎం కృష్ణ, ప్రాథమిక పాఠశాల విభాగం ఇన్‌చార్జి షగుప్తా, డీన్ ఓంకార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.